PRGI No : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 333 పేజీలు - 08 మంగళవారం 27 అక్టోబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## బ్రెజిల్‌లో మరోసారి అరుణ పతాకం!

### అధ్యక్ష ఎన్నికల్లో లూలా ఘన విజయం

**తొలి అక్షరం/బ్రెసిలియా,అక్టోబర్26:** బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా విజయం సాధించారు. రెండో విడత ఓటింగ్‌లో ప్రత్యర్థిపై ఆధిక్యం సాధించి అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నారు. లూలా విజయంతో బ్రెజిల్ రాజకీయాల్లో వామపక్ష శక్తుల ప్రాధాన్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది.విజయం అనంతరం లూలా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రభుత్వ మిగతా2లో...

### తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర

# సానుకూల సంకేతం!

- తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో సానుకూల చర్చలు
- 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనపై సమగ్ర పరిశీలన
- ముంపు ప్రభావం, భూసేకరణపై సంయుక్తంగా అధ్యయనం



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్26:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. ప్రాణహిత నదిపై నిర్మించ తలపెట్టిన ఈ బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, భూసేకరణ, పరిహారం తదితర కీలక అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య ముంబయిలో సమావేశం జరిగింది. ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు, అక్కడి ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం కలగకుండా చూడాలని ఇరు రాష్ట్రాల నేతలు అభిప్రాయపడ్డారు.**గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాజెక్టు కీలకం**తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ద్వారా తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యవసాయానికి నీరు అందుబాటులోకి రావడంతో రైతులకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రాంతీయ మిగతా2లో...




## ఎన్టీఆర్ వర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి!

### - వైద్య పరిశోధనల్లో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించాలి: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**తొలి అక్షరం/విజయవాడ,అక్టోబర్26:** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నుంచి భవిష్యత్తులో నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. వైద్య విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు చేపట్టి, మానవాళి ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన విశ్వవిద్యాలయం 40వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మిగతా2లో...

## పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఊరట!

### - అమిత్ షాపై వ్యాఖ్యల కేసును కొట్టివేసిన సుల్తాన్‌పూర్ ప్రత్యేక న్యాయస్థానం




## మాదాపూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు!

### ముగ్గురు విదేశీ మహిళలకు విముక్తి ప్రధాన నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్26:** హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అనుమానిస్తున్న ముఠాను పోలీసులు గుర్తించారు. మాదాపూర్ పోలీసులు, కూకట్‌పల్లి ప్రత్యేక కార్యాచరణ బృందం సంయుక్తంగా చంద్రనాయక్ మిగతా2లో...



## పెండింగ్ బిల్లుల నిధులు ఖాతాల్లో జమ చేస్తాం!

- పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల బకాయిల చెల్లింపు
- లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తామన్న మంత్రి పొంగులేటి




## గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తా!

- తుమ్మిడిహెట్టిఎల్లంపల్లి ప్రాజెక్టుపై హరీశ్‌రావు సవాల్
- రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం దేనికి?







## కోర్టు ధిక్కరణ పిటిషన్లపై వివరణ ఇవ్వండి!

### - ఉన్నతాధికారులకు ఉన్నత న్యాయస్థానం నోటీసులు

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్26 :** గతంలో ఇచ్చిన న్యాయస్థాన ఆదేశాలను అమలు చేయలేదంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానం స్పందించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. మిగతా2లో...

## ఎన్నికల సంఘం నిర్ణయాలన్నీ సమష్టిగానే తీసుకున్నాం!

### సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం




## దూసుకొస్తున్న అర్నబ్ తుపాను!

- రేవు తీరాన్ని దాటే అవకాశం
- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశాకు తీవ్ర హెచ్చరికలు
- తెలంగాణలో ఎనిమిది జిల్లాలకు భారీ వర్ష సూచన




## రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

### - తెలంగాణ రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం



# ఎన్టీఆర్ వర్సిటీ నుంచి నోబెల్ గ్రహీతలు రావాలి!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. **పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి** వైద్య రంగంలో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు మెరుగైన చికిత్సలు కనుగొనే దిశగా పరిశోధనలు జరగాలని ఉపరాష్ట్రపతి సూచించారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ వైద్య సేవలు, ఆధునిక నిర్ధారణ పద్ధతులు ఆరోగ్య రంగంలో మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా వైద్యులు మానవీయతను, రోగుల పట్ల కరుణను మరువకూడదని స్పష్టం చేశారు. రోగుల భద్రత, వ్యక్తిగత సమాచార గోప్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వైద్య విద్య, ఆరోగ్య రంగానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి కొనియాడారు. నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్యాభివృద్ధికి ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ప్రశంసించారు. వైద్యులు, యువత మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు చూపే పరిశోధనలతో దేశానికి, ప్రపంచానికి సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు. విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహించిన ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, పలువురు మంత్రులు, వైద్య విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర సానుకూల సంకేతం!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ నేపథ్యంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకుని ముందుకు సాగాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. **152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ ప్రతిపాదన**గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయించినప్పటికీ, తెలంగాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని 152 మీటర్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఎత్తు పెంపు వల్ల నీటి వినియోగం, నీటి తరలింపు, ముంపు ప్రాంతాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశాలను సమావేశంలో చర్చించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టు అవసరాలు, ప్రయోజనాలు, నీటి తరలింపు విధానం తదితర అంశాలను మహారాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. సాధ్యమైనంతవరకు గురుత్వాకర్షణ ఆధారంగా నీటిని తరలించడం వల్ల విద్యుత్ వినియోగం తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు ఎత్తు పెంపు అవసరమని వివరించారు. **ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం**బ్యారేజీ ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్ర పరిధిలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున, ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా, వారి ప్రయోజనాలను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు, రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల నేతలు అభిప్రాయపడ్డారు. **స్వతంత్ర అధ్యయనానికి మహారాష్ట్ర అంగీకారం**తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం వల్ల కలిగే ప్రభావాలపై సమగ్రంగా పరిశీలన జరగాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సూచించారు. బ్యారేజీ ఎత్తు, ముంపునకు గురయ్యే భూములు, నీటి లభ్యత, పరిహారం తదితర అంశాలపై స్వతంత్రంగా సాంకేతిక అధ్యయనం చేపట్టాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల అధికారులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి, సంబంధిత అంశాలను పరిశీలించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అధ్యయనంలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని ఫడ్నవీస్ సూచించారు.

# గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తా!

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్26:** తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోతలు లేకుండా గురుత్వాకర్షణ శక్తితో నీటిని తరలించి చూపిస్తే తాను రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. అలా నీటిని తీసుకురాలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, నీటి లభ్యతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. **నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వాలి** తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణకు అవసరమైన నీరు అందుబాటులో లేదని గతంలోనే కేంద్ర జల సంఘం పలుమార్లు తెలిపిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అక్కడ నీటి లభ్యతపై స్పష్టత లేకుండా ప్రాజెక్టు కోసం రూ.25 వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. మహారాష్ట్రతో చర్చలు జరపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఎంత నీరు అందుబాటులోకి వస్తుంది? ఎంత ఆయకట్టుకు సాగునీరు అందుతుంది? నీటిని ఎల్లంపల్లికి ఎలా తరలిస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం సాంకేతిక వివరాలను ప్రజలకు వెల్లడించాలని అన్నారు. **కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించాలి** రాష్ట్రంలో సాగునీటి నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. దేవాదుల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల నిర్వహణపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు ప్రారంభించాలని కోరారు. నీటి లభ్యత, ప్రాజెక్టుల నిర్వహణ, రైతులకు సాగునీటి సరఫరాపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గురుత్వాకర్షణ శక్తితో నీటిని తరలించవచ్చన్న ప్రతిపాదనను సాంకేతిక ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు.

# మాదాపూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు!

(మొదటి పేజీ తరువాయి)

తండాలోని ఓ సేవా నివాస సముదాయంపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని, రక్షణ చర్యలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నాయక్ అనే వ్యక్తి ఈ వ్యవహారాన్ని నిర్వహిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. మహిళల వద్ద భారత్‌లో ఉండేందుకు అవసరమైన చెల్లుబాటు అయ్యే పత్రాలు లేవని గుర్తించారు. పోలీసుల దాడి సమయంలో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న నాయక్ అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. **ఇతరుల ప్రమేయంపై విచారణ**మహిళలు భారత్‌కు ఎలా వచ్చారు? ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళలను న్యాయస్థానం ముందు హాజరుపరిచి, తగిన ఆశ్రయం, పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో సేవా నివాస సముదాయాల యజమానులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గదులను అద్దెకు ఇచ్చే ముందు నివాసితుల గుర్తింపు పత్రాలను పరిశీలించాలని, వారి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎన్నికల సంఘం నిర్ణయాలన్నీ సమష్టిగానే తీసుకున్నాం!

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్26:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయస్థానంలో ప్రతివాద అఫిడవిట్ దాఖలు చేసింది. ఎన్నికల సంఘంలోని ఇతర కమిషనర్ల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ వివాదం తెరపైకి వచ్చింది. దీనిపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించగా, తాజాగా తన వాదనలను సమర్పించింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం6లో ఎలాంటి మార్పులు చేయలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఉపయోగిస్తున్న ప్రకటన పత్రం ఫారం6కు భిన్నమైనదని వివరించింది. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడం, తొలగించడం ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగానే జరుగుతాయని పేర్కొంది. ఓటర్ల వివరాల పరిశీలనలో కొన్ని పత్రాలు అవసరమైన సందర్భాల్లో బూత్ స్థాయి అధికారులు ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపింది. ఈ ప్రక్రియపై వచ్చిన ఆరోపణలను పరిశీలించేందుకు సాంకేతిక నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలన్న అభ్యర్థన చట్టపరంగా సమర్థనీయం కాదని కూడా ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో వాదించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు తదుపరి విచారణలో నిర్ణయాలు తీసుకునే విధానాన్ని పరిశీలించనుంది.

# పెండింగ్ బిల్లుల నిధులు ఖాతాల్లో జమ చేస్తాం!

- పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల బకాయిల చెల్లింపు
- లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తామన్న మంత్రి పొంగులేటి

**తొలి అక్షరం/ఖమ్మం,అక్టోబర్26 :**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న తుది బిల్లుల నిధులను పది రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రైతువేదిక వద్ద రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. మొదటి విడతలో నేలకొండపల్లి మండలానికి మంజూరైన 648 ఇళ్లలో 620 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి వెల్లడించారు. మిగిలిన ఇళ్లు పైకప్పు దశకు చేరుకున్నాయని, వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. **బౌద్ధ క్షేత్రంగా నేలకొండపల్లి అభివృద్ధి** అనంతరం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల అభివృద్ధి, బౌద్ధ వారసత్వ ప్రదేశ పరిరక్షణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. చారిత్రక బౌద్ధ స్థూపాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తికా కపోవడంతో వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అనాసాగరం నుంచి పమ్మి వరకు రెండున్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.2.80 కోట్ల వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు.

# దూసుకొస్తున్న అర్నబ్ తుపాను!

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్26:**
బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను వేగంగా తీరంవైపు దూసుకొస్తున్నది. 28వ తేదీ ఉదయం బాపట్లవిశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరాన్ని దాటే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. అప్పుడప్పుడు గాలుల వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు పెరగవచ్చని అధికారులు హెచ్చరిం చారు. ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో ఇప్పటికే బలమైన ఈదురుగాలుల ప్రభావం కనిపిస్తున్నది. మంగళ, బుధవారాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. **తెలంగాణలో భారీ వర్ష సూచన** అర్నబ్ తుపాను ప్రభావంతో తెలంగాణలో మంగళవారం అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ నారింజ రంగు హెచ్చరిక జారీ చేసింది. ఆ జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు, భారీ వర్షాలు కురిసే జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ, అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ అక్టోబర్26:** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వేర్వేరుగా సమావేశమయ్యారు. తొలుత తన సతీమణి జానకి శుక్లాతో కలిసి రాష్ట్రపతి ముర్మును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో తెలంగాణకు సంబంధించిన రాజకీయ అంశాలతో పాటు పలు విషయాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ సమావేశమైన చిత్రాలను గవర్నర్ కార్యాలయం, రాష్ట్రపతి భవన్, ప్రధానమంత్రి కార్యాలయ వర్గాలు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాయి.

# బ్రెజిల్‌లో మరోసారి అరుణ పతాకం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతానని తెలిపారు. తన విజయానికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు ఎన్నికల ఫలితాలపై ప్రత్యర్థి వర్గం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఓటింగ్ సమయాన్ని పొడిగించడంపై విమర్శలు చేస్తూ, ఈ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేస్తామని ప్రకటించింది. అయితే లూలా మద్దతుదారులు ఆయన విజయాన్ని స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. లూలా విజయంపై పలు దేశాల నాయకులు అభినందనలు తెలిపారు. బ్రెజిల్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఎన్నికల ఫలితాలు దేశ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రభావం చూపనున్నాయి.

# పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఊరట!

**తొలి అక్షరం/లక్నో,అక్టోబర్26:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి పరువునష్టం కేసులో ఊరట లభించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి నమోదైన కేసును ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. **2018లో నమోదైన కేసు** 2018 మేలో కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించాయని ఆరోపిస్తూ అప్పటి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రాహుల్ తరఫు న్యాయవాదులు ఆయన ప్రసంగాన్ని పూర్తి సందర్భంలో పరిశీలించాలని న్యాయస్థానాన్ని కోరారు. **న్యాయస్థానానికి హాజరైన రాహుల్** ఈ నెల 13న ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది. సోమవారం రాహుల్ గాంధీ విచారణకు హాజరైన నేపథ్యంలో తీర్పు వెలువడింది. ఈ సందర్భంగా సుల్తాన్‌పూర్ న్యాయస్థానం ప్రాంగణంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. తీర్పుపై పై న్యాయస్థానంలో అప్పీలు దాఖలవుతాయా లేదా అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. **ప్రయాణంలో కాన్వాయ్‌కు ప్రమాదం** విచారణకు హాజరయ్యేందుకు ఢిల్లీ నుంచి లక్నోకు చేరుకున్న రాహుల్ గాంధీ, అక్కడి నుంచి సుల్తాన్‌పూర్‌కు బయలుదేరారు. పూర్వాంచల్ వేగవంతమైన రహదారిపై ఆయన కాన్వాయ్‌లోని కొన్ని వాహనాలు, ఒక అంబులెన్స్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని, రాహుల్ గాంధీ క్షేమంగా ఉన్నారని పోలీసులు వెల్లడించారు.

# కోర్టు ధిక్కరణ పిటిషన్లపై వివరణ ఇవ్వండి!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మత్స్యకార సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరింది. తదుపరి విచారణను వచ్చే నెల 20వ తేదీకి వాయిదా వేసింది. **ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఆదేశాలు** గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి 2019లో ఇచ్చిన ఆదేశాలను నాలుగు వారాల్లో అమలు చేయాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా నివేదిక సమర్పించకపోతే ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సంతోష్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. యాకూబ్‌తో పాటు మరో 11 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వ శాఖల మధ్య దస్త్రాల బదిలీకి అధిక సమయం తీసుకోవడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. **న్యాయవాదిపై చర్యలకు ఆదేశం** న్యాయవాదిగా కొనసాగకుండా బార్ మండలి సస్పెండ్ చేసినప్పటికీ, న్యాయస్థాన విచారణలకు హాజరవుతున్న ఉషిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని సూచించింది. భూముల్లో విద్యుత్తు తీగల ఏర్పాటు వివాదానికి సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రతిని రాష్ట్ర బార్ మండలికి పంపించి, న్యాయవాదుల సంఘాలకు సమాచారం అందించాలని పేర్కొంది.

# చౌటుప్పల్‌లో సీఐల బదిలీ

**- చౌటుప్పల్ టౌన్ సీఐగా డి. సతీష్ రెడ్డి.. రూరల్ సీఐగా జి. మన్మథ కుమార్**




**తొలి అక్షరం/చౌటుప్పల్,అక్టోబర్ 26:** యాదాద్రి భువనగిరి జిల్లా: చౌటుప్పల్ పట్టణ, గ్రామీణ పోలీస్ విభాగాల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. చౌటుప్పల్ టౌన్, రూరల్ సర్కిళ్లలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీఐలను పరస్పరం బదిలీ చేస్తూ మల్టీ జోన్-11 ఐజీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.చౌటుప్పల్ రూరల్ సర్కిల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న డి. సతీష్ రెడ్డిని చౌటుప్పల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా చౌటుప్పల్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జి. మన్మథ కుమార్‌ను చౌటుప్పల్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. **చౌటుప్పల్‌లో మారిన పోలీస్ అధికారుల బాధ్యతలు**చౌటుప్పల్ టౌన్, రూరల్ పోలీస్ సర్కిళ్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు పోలీస్ సేవలు అందించడం వంటి బాధ్యతలను సీఐలు నిర్వహిస్తారు. తాజాగా జారీ అయిన బదిలీ ఉత్తర్వులతో చౌటుప్పల్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్ అధికారుల బాధ్యతల్లో మార్పు చోటుచేసుకుంది.మొత్తంగా చౌటుప్పల్ టౌన్ సీఐగా డి. సతీష్ రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐగా జి. మన్మథ కుమార్ బాధ్యతలు నిర్వహించనున్నారు ఈ బదిలీలకు సంబంధించి మల్టీ జోన్-11 ఐజీ కార్యాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# చౌటుప్పల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి!

**రైతులను ఆదుకోవడంలోం**

**ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దు**

**బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్..**

**ఆర్డీవోకు సిపిఎం నాయకుల వినతి**



**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 26:** వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చౌటుప్పల్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం చౌటుప్పల్ ఆర్డీవోకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో చౌటుప్పల్ మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, మరోవైపు గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.కరువు పరిస్థితుల కారణంగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా యని, గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.చౌటుప్పల్ మండలంలోని రైతుల పంట నష్టాలను అంచనా వేసి తగిన పరిహారం అందించాలని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రజలకు భరోసా కల్పించాలని బూరుగు కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శివర్గ సభ్యులు తీరిక సంజీవరెడ్డి, నాయకులు మానే సాలయ్య, యాట బాలరాజు, కొంతం శ్రీనివాస్ రెడ్డి, పోచంపల్లి నర్సిరెడ్డి, కొండే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య పద్మశాలీయ నిత్యాన్న సత్రం ధర్మకర్తగా బడుగు బాలరాజు

- **చౌటుప్పల్‌కు దక్కిన అరుదైన గౌరవం**
- **పద్మశాలీయుల ఆధ్యాత్మిక సేవలకు మరింత బలం చేకూర్చడమే లక్ష్యం**





**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 26:** అయోధ్యలో నిర్మించనున్న శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీయ నిత్యాన్న సత్రం ధర్మకర్తగా చౌటుప్పల్‌కు చెందిన బడుగు బాలరాజు ఎంపికయ్యారు. హిందూ సనాతన ధర్మం, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.అయోధ్యలో నిర్మించనున్న ఈ నిత్యాన్న సత్రం ద్వారా భక్తులకు నివాస, భోజన సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ధర్మకర్తగా తనను ఎంపిక చేసిన అఖిలభారత పద్మశాలీయ నిత్యాన్న సత్రాల మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్ పద్మశాలి, అయోధ్య అన్న సత్రం అధ్యక్షులు భూరం శంకర్ పద్మశాలి, కార్యదర్శి గజం గురునాథం పద్మశాలికి బడుగు బాలరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలీయుల సహకారంతో అయోధ్యలో నిర్మించనున్న శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీయ నిత్యాన్న సత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బడుగు బాలరాజు తెలిపారు. శ్రీరామచంద్ర స్వామి కొలువైన పవిత్ర అయోధ్యలో భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. పద్మశాలీయుల ఐక్యత, సహకారంతో ఈ ధార్మిక సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.బడుగు బాలరాజు ప్రస్తుతం చౌటుప్పల్‌లోని శ్రీ భావనా ఋషి కళానికేతన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. అయోధ్య నిత్యాన్న సత్రం ధర్మకర్తగా ఆయన ఎంపిక కావడం పట్ల పద్మశాలీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలి

- **అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ - 26:** పాలేరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని, భూసేకరణ, విద్యుత్ స్తంభాల మార్పు వంటి సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో భూములు, ఇళ్లు కోల్పోయే నిర్వాసితులకు న్యాయం చేయాలని తెలిపారు. పనుల బిల్లుల చెల్లింపులకు ప్రతి నెల రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.సమావేశంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం





**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 26:** ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమాలో రామన్న పేట మండల తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి ఎంపీడీవో రాములు , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పున్న జగన్మోహన్ సింగల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి రామన్నపేట సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి కొమ్మయ్య గూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటే రమేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులు జిలకర ప్రభాకర్ గుత్త నర్సిరెడ్డి సాల్వేర్ అశోక్ వనం చంద్రశేఖర్ జిల్లా వెంకటేశం కోట సుధాకర్ రాయిని రమేష్ శంబాల వెంకన్న వెంకటేశం పిట్ట వెంకటరెడ్డి మొహమ్మద్ నాసర్ మొహమ్మద్ మన్సూర్ అలీ మోటే మహేష్ కొమ్ము శేకర్ బత్తుల నవీన్ ఎర్ర శేఖర్ ఏ పరమేశ మొహ మ్మద్ రిజ్వాన్ అజార్ రుద్రాల విక్కి పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వార్డు సభలు

- **నీటి వృథాను అరికట్టాలి.. పొదుపుగా వినియోగించాలి: కమిషనర్ వెంకటేశ్వర నాయక్**




**తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 26:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే విపత్తులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో ఈ సభలు జరిగాయి.మున్సిపాలిటీలోని 1, 2, 3వ వార్డులకు సంబంధించి రైతు వేదికలో, 7వ వార్డులో సుందరయ్య కాలనీ వాటర్ ప్లాంట్ వద్ద, 14, 16వ వార్డులకు సంబంధించి పీబీ గార్డెన్‌లో వార్డు సభలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, లక్ష్మీ ముత్తయ్య, లావణ్య సురేందర్ రెడ్డి, మంజుల శ్రీనివాస్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని, ప్రతి ఒక్కరూ నీటి పొదుపును బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నీటి వృథాను అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని సభకు హాజరైన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఏఆర్ఓ అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- కరుణాకర్ నియామకం అభినందనీయం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ టీ. కరుణాకర్ తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. క్యాంపు కార్యాలయంలో కరుణాకర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నియామకం జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఫోరం నాయకులకు కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు పార్కింగ్ స్థలం కేటాయించాలి

**- ఆర్‌డీఓకు టీఆర్‌పీ నాయకుల వినతి**

**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని టీఆర్‌పీ నాయకులు కోరారు. సోమవారం ప్రజావాణిలో ఆర్‌డీఓకు వినతిపత్రం సమర్పించారు.పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీఆర్‌పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ తెలిపారు. రోడ్లపై వాహనాల నిలుపుదలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అనువైన స్థలాన్ని కేటాయించి ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుల్ల లక్ష్మి, మున్సిపాలిటీ అధ్యక్షుడు రాములు, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు ఆవ జగన్, రవికుమార్, హరిప్రసాద్, భీమారం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## మన ప్రాంత బిడ్డ వేం నరేందర్ రెడ్డి రాకతో
# కేసముద్రంలో అభివృద్ధి పర్వం!

**నేడు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పర్యటన.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**

**విద్యాసంస్థల పరిశీలన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం వరకు పర్యటన**

**గ్రామానికో 100 మందితో తరలిరావాలి..**

**కాంగ్రెస్ శ్రేణులకు మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ పిలుపు**



**తొలి అక్షరం/కేసముద్రం, అక్టోబర్ 27:** మన ప్రాంత బిడ్డ, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి రాకతో కేసముద్రం మండల అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసముద్రం ప్రాంతంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం మండలంలో నిర్వహించనున్న వేం నరేందర్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. మన ప్రాంతానికి చెందిన నాయకుడు రాజ్యసభ సభ్యుడిగా ఉండటం కేసముద్రం ప్రజలకు గర్వకారణమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులు, సౌకర్యాలు సమకూర్చేందుకు వేం నరేందర్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేసముద్రం మండలంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి రావాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. **విద్యాసంస్థల్లో మౌలిక వసతులపై పరిశీలన** పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు తిమ్మంపేటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని వేం నరేందర్ రెడ్డి సందర్శించనున్నారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు కేసముద్రం విలేజ్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యా సౌకర్యాలపై సమీక్షించనున్నారు. **హరే కృష్ణ ఫౌండేషన్ పనుల పరిశీలన** మధ్యాహ్నం 3 గంటలకు హరే కృష్ణ ఫౌండేషన్ కిచెన్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. పౌష్టికాహార పంపిణీకి ఉపయోగపడే ఈ కేంద్రానికి సంబంధించిన నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకోనున్నారు. **ఉప్పరపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం** మధ్యాహ్నం 3.30 గంటలకు ఉప్పరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. **బహిరంగ సమావేశానికి భారీగా తరలిరావాలి** సాయంత్రం 4 గంటలకు ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే బహిరంగ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డితో పాటు ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమా మురళి నాయక్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి కనీసం 100 మంది చొప్పున కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి పర్యటనను విజయవంతం చేయాలని చిలువేరు సమ్మయ్య గౌడ్ కోరారు. మన ప్రాంత అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## రామాయణం సమాజానికి ఎన్నో విలువలను అందించింది

**• వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ – 26:** మహాకవి వాల్మీకి రచించిన రామాయణం సమాజానికి ఎన్నో నైతిక విలువలను అందించిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణం ఆదర్శ మానవ లక్షణాలు, కుటుంబ సంబంధాలు, నైతిక విలువలను బోధిస్తుందని తెలిపారు. వాల్మీకి రచనలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి. జ్యోతి, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు



**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 26:** రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామన్నపేట మండల కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించిన మాటలు మాట్లాడడం కనీస అవగాహన లేకుండా సంస్కారం లేకుండా ఇష్టం ఉన్న రీతిలో మాట్లాడడం వారికి తగదు వాళ్ల నాయకుని దగ్గర మెప్పుకోసం మాట్లాడడం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ను విమర్శించే స్థాయి వారికి లేదు ఇకనుంచి బిఆర్ఎస్ పార్టీని గానీ చిరుమర్తి లింగయ్యను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మండలాధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి సర్పంచు కోనూరు సాయికుమార్ మాజీ ఎంపీటీసీలు సర్పంచులు వేమవరం సుధీర్ బాబు దోమల సతీష్ పున్న వెంకటేశం ఎండి ఆమీర్ బందేల యాదయ్య జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం బద్దుల రమేష్ అంతటి రమేష్ నాయకులు నాయకులు ఇడం శ్రీనివాస్ పులిపలుపుల వీరస్వామి బత్తుల వెంకన్న ఎడ్ల కృష్ణారెడ్డి బండ శ్రీనివాస్ రెడ్డి ఆమనగంటి నరసింహ జెట్టి శివప్రసాద్ గంగుల రాఘవరెడ్డి అనంత చారి మహేష్ వెంకటేశం బొడ్డుపల్లి రాజు కోనూరు లింగస్వామి లక్ష్మయ్య బొడ్డు మల్లయ్య క్రాంతి కుమార్ మామిళ్ళ కుమార్ ఎండి అజాజ్ రాస వెంకటేశ్వర్లు బిక్షం రాజిరెడ్డి నర్రా విజయ్ దండిగా నాగరాజు నాంపల్లి లింగయ్య శ్రీకాంత్ వెంకన్న అంజయ్య సత్తయ్య నాగరాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## రక్తదానం చేసిన రామన్నపేట పోలీసులు




**తొలి అక్షరం/రామన్నపేట అక్టోబర్ 26:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన పోలీస్‌స్టేషన్ సిబ్బంది రక్తదానం చేసి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు, అక్టోబర్ 21న నిర్వహించే పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు,జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ శ్రీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, హిమాయత్‌నగర్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో రామన్నపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన పది మంది సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. సీఐ మోలుగు రవి, ఎస్ఐ గోపతి సతీష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారిలో పోలీస్ కానిస్టేబుళ్లు స్వామినాయక్, నరసింహ, హనుమంత్, ప్రవీణ్, లింగస్వామి, శశికాంత్, హోంగార్డు రవి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని ఎంబీబీఎస్ చదువుకు: ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక భరోసా

**- పవిత్ర ఐదేళ్ల ట్యూషన్, హాస్టల్ ఫీజు ఖర్చులకు ఆర్థిక సాయం.. తొలి ఏడాది ఫీజు చెల్లింపు**





**తొలి అక్షరం/నెక్కొండ అక్టోబర్ 26:** వరంగల్ జిల్లా నెక్కొండ పరిధిలో పేదరికం ఉన్నత విద్యకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఓ పేద విద్యార్థిని వైద్య విద్యను అభ్యసించేందుకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆర్థిక భరోసా కల్పించారు. నెక్కొండ మండలం పెద్దకొర్పోల్ గ్రామానికి చెందిన బాధావత్ శోభన్ కుమార్తె పవిత్ర హైదరాబాద్ సమీపంలోని నార్కెట్‌పల్లిలో ఉన్న కామినేని వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్య విద్యను కొనసాగించడం,ట్యూషన్ ఫీజు హాస్టల్ ఖర్చులను భరించడం కుటుంబానికి భారంగా మారింది. పేదరికాన్ని అధిగమించి వైద్య విద్య వైపు. పెద్దకొర్పోల్ గ్రామానికి చెందిన బాధావత్ శోభన్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన కుమార్తె పవిత్ర చదువుపై ఆసక్తితో కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించింది. వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న పవిత్రకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారాయి. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు మాజీ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యుడు, నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గటిక అజయ్ కుమార్. పవిత్ర కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గటిక అజయ్ కుమార్ వెంటనే స్పందించారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థినికి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం చేజారకూడదనే ఉద్దేశంతో ఆమె కుటుంబానికి అండగా నిలిచారు. ఈ విషయాన్ని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పవిత్ర వైద్య విద్యను పూర్తిచేసేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. **ఐదేళ్ల పాటు ట్యూషన్, హాస్టల్ ఫీజు ఖర్చులకు భరోసా.** గటిక అజయ్ కుమార్ విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పవిత్ర విద్యాభ్యాసానికి సహకరించేందుకు ముందుకొచ్చారు. ఎంబీబీఎస్ చదివే ఐదేళ్ల కాలానికి అవసరమైన ట్యూషన్ హాస్టల్ ఫీజు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన మొత్తాన్ని ఇప్పటికే చెల్లించినట్లు తెలిసింది. పేద కుటుంబానికి చెందిన పవిత్ర వైద్య విద్యను నిరాటంకంగా కొనసాగించేందుకు ఎమ్మెల్సీ అందించిన ఆర్థిక భరోసా ఆ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి నుంచి బయటపడేందుకు ఈ సహకారం దోహదపడనుంది. **ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు.** తమ కుమార్తె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి పవిత్ర కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, వైద్య విద్యను అభ్యసించేందుకు అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తమ సమస్యను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా కృషి చేసిన గటిక అజయ్ కుమార్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి

**- నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వేముల వీరేశం**



**రామన్నపేట, అక్టోబర్ 26 (తొలి అక్షరం):** నల్లగొండఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రామన్నపేట లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం సందర్శించారు. నమోదు ప్రక్రియను పరిశీలించి, ఇప్పటివరకు నమోదైన పట్టభద్రులు, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తరఫున నమోదు ప్రక్రియలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: మంత్రి పొంగులేటి**



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ – 26:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండలం గోరిల్లపాడు తండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో రహదారులు, పొలాలకు వెళ్లే దారులు, స్మశాన వాటికలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హత జాబితాల్లో పొరపాట్లు ఉంటే సరిదిద్ది, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఉచిత విద్యుత్, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, తెల్ల రేషన్ కార్డులు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భారీ వర్ష సూచన.. అప్రమత్తంగా ఉండాలి

**- అధికారులకు కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశం**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి అక్టోబర్ - 26:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో వర్షాలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు.జిల్లాలో 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నియంత్రణ కేంద్రాన్ని నిర్వహించాలని, పాలేరు, వైరా రిజర్వాయర్ల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు.ఈదురుగాలులతో చెట్లు కూలినప్పుడు వెంటనే తొలగించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, ప్రమాదకర వాగులు, కాజ్‌వేల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని, ఒంటరి వృద్ధులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వర్ష తీవ్రతను బట్టి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.అధికారులందరూ అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే చొరవతో బేడ బుడగ జంగాల సంఘానికి ట్రాన్స్‌ఫార్మర్

- షాద్‌నగర్‌లో బేడ బుడగ జంగాల కమిటీ హాల్‌కు విద్యుత్ సౌకర్యం
- బేడ బుడగ జంగాల సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** బేడ బుడగ జంగాల సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకున్నారు. సంఘం కమిటీ హాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 25 కేవీఏ సామర్థ్యం గల సింగిల్‌ఫేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కమిటీ హాల్ నిర్మాణ పనులకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రానుంది.సంఘం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సహకరించడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ హాల్ నిర్మాణం పూర్తయితే సంఘం సమావేశాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు స్వామి, వానరసి యాదవ్, సద్దుల బాలకృష్ణ, కళ్లెం ఉషయ్య, వానరసి నరసింహ, సద్దుల యాదయ్య, తూర్పాటి మొగులయ్య ,సద్దుల నందు, వానరసి జగన్, నరసింహ తో పాటు బేడ బుడగ జంగాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రనగర్ కాలనీవాసులకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు

- ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాల పంపిణీ
- కౌన్సిలర్ ఎస్పీ శివ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలు



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డు ఇంద్రనగర్ కాలనీలో ఐడీబీఐ బ్యాంకు సహకారంతో కౌన్సిలర్ ఎస్పీ శివ ఆధ్వర్యంలో కాలనీవాసులకు జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలను అందజేశారు. బ్యాంకింగ్ సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ఆర్థిక సహాయాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో పొందేందుకు ఖాతాలు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. జీరో బ్యాలెన్స్ ఖాతాల ద్వారా కనీస నిల్వ ఉంచాల్సిన అవసరం లేకుండా బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎస్పీ శివ మాట్లాడుతూ, కాలనీవాసులు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంతో కాలనీవాసులకు బ్యాంకు ఖాతాల ఏర్పాటులో సహకారం అందింది.

# వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**- వాల్మీకి మహర్షి ఆశయాలు సమాజానికి స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.రామాయణ మహాకావ్యాన్ని రచించి భారతీయ సంస్కృతి,నైతిక విలువలు,ధర్మ మార్గాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సమాజంలో మానవత్వం,సమానత్వం,సోదరభావం,నైతిక విలువలను పెంపొందించడంలో వాల్మీకి మహర్షి బోధనలు ఎంతో కీలకమని తెలిపారు.మహర్షి వాల్మీకి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ఆయన చూపిన మార్గంలో నడుస్తూ భావితరాలకు మంచి విలువలను అందించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి,ప్రజాప్రతినిధులు,అధికారులు,వాల్మీకి సంఘం నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున నగర్ కాలనీ అభివృద్ధికి సహకరించండి





- మాజీ మేయర్ కోటేష్ గౌడ్‌కు కాలనీ కమిటీ విజ్ఞప్తి

**తొలి అక్షరం/జవహర్ నగర్, అక్టోబర్ 26:** జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీలు లాంటి మౌలిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ, కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు 2026, అక్టోబర్-26, సోమవారం రోజున జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారుఅనంతరం ధనలక్ష్మి, కె. బాలు మాట్లాడుతూ, తమను అభినందించి, శుభాకాంక్షలు తెలిపినందుకు మాజీ మేయర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశామని వెల్లడించారు. అలాగే నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ కమిటీకి అండగా ఉంటానని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాజీ మేయర్ హామీ ఇచ్చారని తెలిపారు. కాలనీ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించి, ప్రజల మన్ననలు పొందేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జలంధర్, సలహాదారులు వెంకటేష్, మహేష్, సారమ్మ, ఈశ్వర్ , కాంగ్రెస్ నేతలు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీలు లాంటి మౌలిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ, కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు 2026, అక్టోబర్-26, సోమవారం రోజున జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ను కలిసి విజ్ఞప్తి చేశారుఅనంతరం ధనలక్ష్మి, కె. బాలు మాట్లాడుతూ, తమను అభినందించి, శుభాకాంక్షలు తెలిపినందుకు మాజీ మేయర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశామని వెల్లడించారు. అలాగే నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపి కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తమ కమిటీకి అండగా ఉంటానని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాజీ మేయర్ హామీ ఇచ్చారని తెలిపారు. కాలనీ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించి, ప్రజల మన్ననలు పొందేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జలంధర్, సలహాదారులు వెంకటేష్, మహేష్, సారమ్మ, ఈశ్వర్ , కాంగ్రెస్ నేతలు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

# కిసాన్ సభ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**- నవంబర్ 15న నల్లగొండ రైతు బహిరంగ సభకు తరలిరండి**



**తొలి అక్షరం/కొణిజర్ల అక్టోబర్ 26:** రైతుల హక్కుల సాధన కోసం అఖిల భారత కిసాన్ సభ నిర్వహిస్తున్న 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే మహాసభల సందర్భంగా 15న నిర్వహించే రైతు బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.సోమవారం కొణిజర్ల మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించిన నాయకులు రైతు భీమా పథకాన్ని కొనసాగించాలని, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పెసర ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్, భూక్యా కృష్ణ, వెంకన్న, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన“సురక్షిత బచ్‌పన్ అభియాన్“కార్యక్రమం

**బాలల హక్కుల పరిరక్షణ**

**ప్రతి ఒక్కరి బాధ్యత**

**వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ**








**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ (హైదరాబాద్) ఆదేశాల మేరకు,వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 26అక్టోబర్ నుండి 31అక్టోబర్, 2026 వరకు నిర్వహించనున్న “సురక్షిత బచ్‌పన్ అభియాన్“ (సురక్షిత బాల్యం ప్రచారం) కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రచారంలో భాగంగా మొదటి రోజు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల,దేశాయిపేట,మామనూరు,ఏకశిల ఇ-టెక్నో స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులలో “నా బిడ్డ - నా హక్కు“ (మై చైల్డ్ - మై రైట్ అనే ముఖ్యమైన అంశంపై విద్యార్థులకు,ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ మాట్లాడుతూ...“బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా బాల్యానికి రక్షణ లభిస్తుందని,విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదురైనా ధైర్యంగా న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించవచ్చని భరోసా ఇచ్చారు.పిల్లలను శారీరక,మానసిక,లైంగిక వేధింపుల నుండి రక్షించడం సమాజం మరియు చట్టం యొక్క బాధ్యత అని వివరించారు.పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారందరినీ పిల్లలుగానే పరిగణిస్తారని,ఆడ-మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఈ చట్టం వర్తిస్తుందని గౌరవ న్యాయమూర్తి స్పష్టం చేశారు.ఈ అవగాహన కార్యక్రమాల్లో భరోసా కేంద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సువర్ణ,షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.రామారావు, హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం) సి.ఐ ఓ.రమేష్,లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ...బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు,ఆన్‌లైన్ నేరాలు,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పోలీసు మరియు న్యాయ వ్యవస్థలు నిరంతరం శ్రమిస్తున్నాయని తెలిపారు.విద్యార్థులు ఆపద సమయంలో డయల్ 100 లేదా షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.వేధింపులకు గురైన పిల్లల లేదా సమాచారం అందించిన వారి పేర్లు,వివరాలను చట్టప్రకారం పూర్తిగా రహస్యంగా ఉంచుతామని,కాబట్టి ఎలాంటి భయం లేకుండా ఫిర్యాదు చేయవచ్చని న్యాయమూర్తి భరోసా ఇచ్చారు.ఆపదలో ఉన్న బాలల కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఎ) ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని,అలాగే భరోసా కేంద్రాలు,షీ టీమ్స్ మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) నిరంతరం అందుబాటులో ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ ప్రచార కార్యక్రమం అక్టోబర్ 31 వరకు జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో కొనసాగుతుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. బాలల హక్కుల పోస్టర్స్ ను ఆవిష్కరించి, పాఠశాలల గోడలపై అంటించడం జరిగింది.

# జాతీయ స్థాయిలో వరంగల్‌కు అవార్డు దక్కడం గర్వకారణం

**హనుమకొండ జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి,కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి,మున్సిపల్ కమిషనర్ వెంకన్న,అధికారులకు అభినందనలు: కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** జాతీయ స్థాయిలో నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో వరంగల్ నగరానికి అరుదైన గుర్తింపు లభించి అవార్డు రావడం గర్వకారణం అని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు.సోమవారం హనుమకొండ లోని కుడా కార్యాలయంలో వరంగల్ నగరానికి జాతీయ అవార్డు రావడం పట్ల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి...జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి,కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి,జీడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న, కుడా సీపీవో అజిత్ రెడ్డి,తదితరులను కుడా ఛైర్ పర్సన్ అభినందించారు.ఈ సందర్భంగా కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ...ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో శనివారం కేంద్ర గృహనిర్మాణ,పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి అర్బన్ కాన్‌క్లేవ్‌లో నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో వరంగల్ నగరానికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ విభాగంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీలో వరంగల్,చెన్నై నగరాలకు రావడం గొప్పవిషయం అన్నారు.ఈ అవార్డు వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.వరంగల్ నగరానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ అవార్డు వరంగల్ నగరంలో పర్యావరణహిత పట్టణాభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్నిస్తుందని కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి పేర్కొన్నారు.స్మార్ట్ సిటీ లో భాగం గా...గతంలో రెండు కోట్ల రూపాయల నిధులతో నగరం లో సైకిల్ ట్రాక్ నిర్మించినట్టు ఈ సందర్భంగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి గుర్తు చేసారు.నగర అభివృద్ధి కి తమ వంతు బాధ్యత గా ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కుడా ఈఈ భీమ్ రావు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# "ఓట్ బచావో దేశ్ బచావో" సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...

**- ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి కాంగ్రెస్ నాయకుడు,కార్యకర్త కృషి చేయాలి**




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "ఓట్ బచావో దేశ్ బచావో" ఫేజ్3 ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు,టీపీసీసీ నాయకులు,ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని ప్రచార కార్యక్రమం అమలు,భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించడం,ఓటర్లలో అవగాహన పెంపొందించడం,పార్టీ శ్రేణులను కార్యక్రమంలో భాగస్వాములను చేయడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఏఐసీసీ సూచనల మేరకు "ఓట్ బచావో దేశ్ బచావో" ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన రాంలీలా మైదానంలో నిర్వహించనున్న "ఛలో ఢిల్లీ" కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని,తెలంగాణ గళాన్ని దేశ రాజధానిలో వినిపించాలన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటు హక్కు రక్షణ లక్ష్యంగా చేపడుతున్న "ఓట్ బచావో దేశ్ బచావో" ఉద్యమంలో ప్రతి నాయకుడు,కార్యకర్త భాగస్వామి కావాలి.ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు,చైర్మన్లు,డివిజన్ అధ్యక్షులు,మండల అధ్యక్షులు,సర్పంచులు,నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో 62 మంది రక్తదానం

**పోలీసుల సేవాభావం.. రక్తదానంతో మానవత్వం**

**అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీసీపీ షిరీష రాఘవేంద్ర పర్యవేక్షణలో, ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. షాద్‌నగర్ జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల సమన్వయంతో నిర్వహించిన శిబిరంలో మొత్తం 62 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు సైతం రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమానికి జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు హాజరయ్యారు. రక్తదానం చేసిన వారందరికీ పండ్లు, పండ్ల రసాలు పంపిణీ చేసి అభినందించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ శిబిరం సేవ, త్యాగం, మానవత్వానికి ప్రతీకగా నిలిచింది. ప్రజల రక్షణతో పాటు సామాజిక బాధ్యతల్లోనూ పోలీసులు ముందుంటారని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

# షాద్‌నగర్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**పోలీస్ ఫ్లాగ్ డే వీక్‌లో రక్తదానం.. డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు**

**రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన ఆటో, తుఫాన్ డ్రైవర్లు**





**తొలి అక్షరం/షాద్ నగర్,అక్టోబర్ 26:** పోలీస్ ఫ్లాగ్ డే వీక్2026లో భాగంగా సోమవారం షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ (లా అండ్ ఆర్డర్) ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, తుఫాన్ వాహనాల డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ట్రాఫిక్ పోలీసుల తరఫున ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.అత్యవసర సమయాల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకునే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని నిర్వాహకులు సూచించారు. సేవా కార్యక్రమంలో భాగస్వాములైన ఆటో, తుఫాన్ డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసులు కృషి చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 31వ డివిజన్ ఎంఎల్‌సి ఇంచార్జ్ మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో 31వ డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొన్నారు.పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాం రెడ్డి ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు 31 డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,డివిజన్ ఎం ఎల్ సి ఇంచార్జ్ మామిండ్ల సురేష్, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిపించారు.ఈ కార్యక్రమంలో నాగనమైన బాబురావు,మంద సునీల్, వెల్దండి రాజేష్,బొల్లెన పున్నం చందర్, కోరిగొప్పల సంజయ్,మేరుగు శ్రవణ్,కూర క్రాంతి,సట్ల శ్రీకాంత్,దద్దు రాజకుమార్, మామిడాల సంతోష్,మాచర్ల అనిల్,సీనియర్ నాయకులు బూత్ ఇన్చార్జులు కాంగ్రెస్ శ్రేణులు పాలుగొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల అరెస్టులపై నేతల ఆగ్రహం

**• ఎవరో ఇచ్చిన పిలుపుతో మాకేంటి సంబంధం?**

**పోలీసుల తీరుపై మండిపాటు**





**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేయడంపై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి. వెంకట్రాంరెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ కేపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో ఇచ్చిన పిలుపుతో సంబంధంలేని ఉద్యమకారులను అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుతో పాటు వారి గుర్తింపు కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని, కమిటీకి సూచనలు, సలహాలు అందిస్తున్నామని వెల్లడించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా పోరాడుతున్న తరుణంలో అరెస్టుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. పోలీసుల వైఖరి మారాలని, తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడాలని వారు కోరారు.

# 36 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**• ఆటపాటలు, నృత్యాలతో సందడిగా పూర్వ విద్యార్థుల కలయిక**

**తొలి అక్షరం/కొణిజర్ల అక్టోబర్ 26:** పెద్ద మునగాల ఉన్నత పాఠశాలలో 19861990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 36 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేస్తూ పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.సుమారు 50 ఏళ్ల వయసులోనూ చిన్ననాటి స్నేహితుల్లా ఉత్సాహంగా పాల్గొని ఆనందంగా గడిపారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి, పూర్వ విద్యార్థులందరికీ జ్ఞాపికలు పంపిణీ చేశారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు ఎస్కే జానీమియా, డి. సత్యనారాయణ, వి. జయమ్మలను ఘనంగా సన్మానించారు.ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ అంగరంగ వైభవంగా సాగింది.



# గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- ప్రజావాణిలో సమస్యలపై పవన్ కళ్యాణ్ వినతి**



**తొలి అక్షరం/కొందుర్గు, అక్టోబర్ 26:** కొందుర్గు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గంగన్నగూడెం గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ అధికారులను కోరారు. సోమవారం కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు.మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డులను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు చట్టం-2005పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు స్పందించి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదిరెడ్డి, రవి, టీఆర్పీ నాయకులు దర్గా వెంకటేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్టాండ్ విత్ హర్ మారుతున్న కాలం...మారాల్సిన ఆలోచన

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం
- సైబర్ క్రైమ్స్, సీఐడీ, ఏసీబీ డీజీ చారు సిన్హా ఐపీఎస్ ప్రత్యేక చొరవ
- మౌనం వీడి బాధ్యత తీసుకోవాలని పిలుపు
- నేటితో ముగియనున్న రెండు రోజుల శిక్షణా శిబిరం





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్26:** సమాజంలో మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదు...ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత కావాలనే నినాదంతో తెలంగాణ పోలీస్ శాఖ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టాండ్ విత్ హర్ ప్రచార కార్యక్రమం ఇప్పుడు యూనివర్సిటీ స్థాయికి చేరింది. మగవారంతా కేవలం మూగ ప్రేక్షకులుగా ఉండిపోకుండా, అన్యాయాన్ని ప్రశ్నించే ధీరులుగా మారాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వేడుకగా ప్రారంభం.ప్రముఖ విద్యా సంస్థ అయిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వేదికగా అక్టోబర్ 26న రెండు రోజుల ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి సీఐడీ, ఏసీబీ, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ చారు సిన్హా, ఐపీఎస్ నేతృత్వం వహించారు. ఈ వేడుకకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జె.అనురాధ, రిజిస్ట్రార్ డాక్టర్ దేవ్ నిగమ్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కే. సునీతా రాణి తదితరులు హాజరయ్యారు.**మనం మౌనంగా ఉంటే... మనమూ దోషులమే:** ఈ సందర్భంగా డీజీ చారు సిన్హా మాట్లాడుతూ తీవ్రమైన ఆవేదన, అంకితభావంతో కీలక వ్యాఖ్యలు చేశారు. మనం మౌనంగా ఉన్నామంటే.. ఆ తప్పులో మనమూ భాగస్వాములమే అవుతాం అని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా జరిగే వేధింపులను, ఇంట్లోనూ, బయటా కనిపించే పితృస్వామ్య భావజాలాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పురుషాధిక్య భావనల వల్ల మగపిల్లల్లో భావోద్వేగాల వ్యక్తీకరణ కూడా కుంటుపడుతోందని, గౌరవం, సమానత్వం నిండిన వాతావరణం ఏర్పడినప్పుడే నిజమైన మార్పు సాధ్యమని పేర్కొన్నారు.సమాజంలో సంస్కరణలు ఎక్కడి నుంచో రావాలని కోరుకోవడం కాకుండా, ముందుగా మన ఇళ్ల నుంచే సమానత్వం మొదలు కావాలని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కే. సునీతా రాణి గట్టిగా నిలదీశారు.చుట్టూ ఉన్న ప్రతీ రంగాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా మలచాలని చూస్తున్నప్పుడు.. ఇంటిని ఎందుకు మార్చలేకపోతున్నాం? దాన్ని ఎందుకు తేలిగ్గా తీసుకుంటున్నాం? అంటూ ఆమె లేవనెత్తిన ప్రశ్న అందరినీ ఆలోచింపజేసేలా ఉంది. **రుబరూ సహకారంతో వినూత్న రీతిలో శిక్షణ**కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, రుబరూ బృందంతో కలిసి అనుభవపూర్వక అభ్యాసన పద్ధతిలో ఈ వర్క్‌షాప్ కొనసాగుతోంది. యువత చర్చలు జరపడం ద్వారా, రోజువారీ అనుభవాలపై పునరాలోచించుకునేలా ఈ సంభాషణలు సాగుతున్నాయి. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తమ సమాజంలోకి వెళ్లి ఈ మంచి ఆలోచనలను వ్యాప్తి చేయాలన్నదే ఈ ట్రైనర్ల శిక్షణ ముఖ్య ఉద్దేశం.మహిళల భద్రత, ఆత్మగౌరవం, సమానత్వం అనేవి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, అది మన అందరి సమిష్టి బాధ్యత అని చాటుతూ ఈ రెండు రోజుల సదస్సు అక్టోబర్ 27తో విజయవంతంగా ముగియనుంది.

# ఓటర్ల జాబితా అక్రమాలపై కాంగ్రెస్ మూడో దశ కార్యాచరణ

- 'ఓట్ బచావోదేశ్ బచావో' ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఓటర్ల జాబితాలో అక్రమాలపై పోరాటంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావోదేశ్ బచావో' ఉద్యమ మూడో దశ కార్యాచరణను ఖరారు చేసింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, టీపీసీసీ సమన్వయకర్త అరికెల నర్సారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కేబీఆర్ నాయుడు, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓట్లు తొలగిస్తున్నారంటూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ దేశ ప్రజల భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడుతున్నారని కేబీఆర్ నాయుడు పేర్కొన్నారు.మూడో దశలో భాగంగా బ్లాక్, బూత్, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి, ఓటర్ల జాబితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు నాయకులు తెలిపారు. 'ఓట్ రక్షక్' డిజిటల్ వేదిక వినియోగంపై బూత్ ఏజెంట్లు, స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి, తొలగించిన లేదా మార్పులు చేసిన ఓట్ల వివరాలను పరిశీలిస్తామని వెల్లడించారు. గ్రామాల్లో రచ్చబండ సమావేశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి

- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం
- లైంగిక దాడుల నుంచి పిల్లల రక్షణకు పోక్సో చట్టం




**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** విద్యార్థులపై లైంగిక దాడుల నిరోధానికి పోక్సో చట్టం అమలులో ఉందని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాల్యాల సాహితి అన్నారు. సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని, భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు, సర్పంచ్ కొమ్ము కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీన్ పట్టి కోటలో...ఖాకీల సంచలన రైడ్

- కేపీహెచ్‌బీ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట
- బడా వ్యాపారులు, వృద్ధులుసహా 10 మంది అరెస్ట్
- రూ.86,100 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్26:** వయసు మీదపడింది.. అనుభవమూ ఎక్కువే.. కానీ సరదా కాస్తా వ్యసనంగా మారి అర్ధరాత్రి దాటాక పేకాట కూటాలు నిర్వహిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో కేపీహెచ్‌బీ ఘటన మరోసారి నిరూపించింది. ఫంక్షన్‌కు వెళ్లొచ్చి మరీ.. రహస్య ప్రాంతంలో గుప్తచీకటిలో సాగిన టీన్ పట్టి ఆటను పోలీసులు చాకచక్యంగా భగ్నం చేశారు. బడా బాబులు, రిటైర్డ్ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. **అర్ధరాత్రి దాటాక కదలికలు... పక్కా ప్లాన్‌తో ఎంట్రీ:**కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ శంకర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి అక్టోబర్ 25 రాత్రి నుంచి నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.సరిగ్గా అక్టోబర్ 26 తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులకు ఒక నమ్మదగిన సమాచారం అందింది. కేపీహెచ్‌బీ కాలనీ, ఎంఐజీ-2 కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న భవనంలో కొందరు వ్యక్తులు డబ్బులతో పేకాట ఆడుతున్నారు అనేదే ఆ మ్యాటర్.వెంటనే అప్రమత్తమైన ఎస్సై ఇద్దరు పంచ్ సాక్షులను పిలిపించారు.వారి సమక్షంలో సిబ్బంది మను నాయక్, కానిస్టేబుళ్లు రాజు తదితరులతో కలిసి ఆ భవనం రెండో అంతస్తులోని గది వద్దకు చేరుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తలుపు తట్టగా..లోపలి నుంచి ఒకరు తలుపు తీశారు. **కళ్ల ముందే షాకింగ్ దృశ్యం:**పోలీసులు ఒక్కసారిగా గదిలోకి ప్రవేశించేసరికి.. అక్కడ పది మంది ఒక వృత్తాకారంలో కూర్చుని పెద్ద ఎత్తున డబ్బులతో పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. పోలీసులను చూసిన వెంటనే వారి గుండెలు గుభేల్మన్నాయి. అందులో ఒక్క వ్యక్తి మెరుపు వేగంతో అక్కడి నుంచి పరారయ్యాడు.మిగిలిన 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **పట్టుబడిన వారి వివరాలు ఇవే:**పట్టుబడిన వారిలో కుకట్‌పల్లి, ఖైరతాబాద్, మలక్‌పేట్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, బోడుప్పల్ తదితర ప్రాంతాలకు చెందిన బడా వ్యాపారులు, రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో కొందరి వయసు 50 నుంచి 80 ఏళ్లకు పైగా ఉండటం గమనార్హం. వీరంతా అంతకుముందు రోజు ఒక ఫంక్షన్‌లో కలుసుకుని, అక్కడి నుంచి రాత్రి 11 గంటలకు ఈ ఇంటికి చేరుకుని జూదం ఆడుతున్నట్లు విచారణలో తేలింది. స్వాధీనం చేసుకున్నది ఇవే:1.4 సెట్ల పేకాట కార్డులు2.నగదు: రూ86,100సంఘటన స్థలంలో లభించిన నగదును, పేకాట సామగ్రిని పంచుల సమక్షంలో సీజ్ చేసి, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా జూదానికి పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదనే హెచ్చరికను ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది.

# ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం

- 14వ వార్డులో కమ్యూనిటీ హాల్‌కు ముగ్గు వేసిన చైర్మన్
- ముదిరాజ్ సంఘానికి సొంత భవనం.. నిర్మాణ పనులు ప్రారంభం



**తొలి అక్షరం/షాద్ నగర్, అక్టోబర్ 26:** ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ముగ్గు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి పాల్గొన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే ముదిరాజ్ సంఘం సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. సంఘం సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు కూడా ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సి. పెంటయ్య, శ్రీశైలం గౌడ్, మున్సిపల్ డీఈ నరేష్, ఏఈ సాయి కిరణ్, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



# డిజిపి కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), అక్టోబరు26:**

డిజిపి కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని,భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు విశేష సేవలందించిన మహనీయుడని కొనియాడారు.చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి, సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు.డిజి లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్,ఏఐజీ (అడ్మిన్) జె. అన్యోన్య,చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వర రావు,పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు సీఏవోలు,ఏఓలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 24 గంటల్లో హత్య కేసు ఛేదన

- పర్వతగిరి ఎస్సై రాజ్‌కుమార్‌ను అభినందించిన సీఐ సంతోష్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్26:**పర్వతగిరి మండలంలోని మాల్యతండా పరిధిలో జరిగిన హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన ఎస్సై పి. రాజ్‌కుమార్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ అభినందించారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితుడు చేసిన ప్రయత్నాన్ని ఎస్సై తన సిబ్బందితో కలిసి గుర్తించి, ఆధారాల సేకరణతో కేసును ఛేదించారు. చింతనెక్కొండ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.ఎస్సై రాజ్‌కుమార్ వేగవంతమైన దర్యాప్తు, సమర్థతను సీఐ సంతోష్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే అంకితభావంతో ప్రజలకు రక్షణగా నిలుస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. అధికారుల అప్రమత్తత నేరాల నియంత్రణలో కీలకమని, రాజ్‌కుమార్ పనితీరు ఇతర సిబ్బందికి ఆదర్శమని కొనియాడారు.

## బాక్సాఫీస్ చరిత్రను తిరగరాసిన రజనీ..

## తమిళ సినీ చరిత్రలో నెం.1 చిత్రంగా 'జైలర్ 2'!



సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా ఏంటో నిరూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు రజనీ, అక్షయ్ కుమార్ నటించిన '2.0' పేరిట ఉన్న రికార్డును ఈ సినిమా బద్దలు కొట్టింది. '2.0' తన లైఫ్‌టైమ్ థియేట్రికల్ రన్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 691 కోట్లు వసూలు చేయగా, ఆ రికార్డును 'జైలర్ 2' అధిగమించింది.అక్టోబర్ 15న విడుదలైన ఈ చిత్రం, కేవలం 11 రోజుల్లోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకుంది. ట్రేడ్ ట్రాకర్ 'శాక్నిల్క్' ప్రకారం.. ఆదివారం నాటికి 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా రూ. 710.35 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసింది. దీంతో 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రంగా కూడా నిలిచింది. దేశీయంగా కూడా ఈ సినిమా అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. ఆదివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా రూ. 25.70 కోట్ల గ్రాస్ వసూలు చేయగా, మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్ రూ. 466.85 కోట్లకు చేరింది. ఇండియా నెట్ కలెక్షన్ రూ. 398.70 కోట్లుగా ఉంది.విడుదలైన అన్ని భాషల్లోనూ 'జైలర్ 2' అద్భుతమైన ఆదరణ పొందుతోంది. ఆదివారం రోజున తమిళ వెర్షన్ 5,683 షోల ద్వారా రూ. 17.35 కోట్లు వసూలు చేయగా, తెలుగు వెర్షన్ 1,860 షోల ద్వారా రూ. 4.50 కోట్లు రాబట్టింది. హిందీ వెర్షన్ రూ. 3.15 కోట్లు, కన్నడ వెర్షన్ రూ. 0.70 కోట్లు కలెక్ట్ చేశాయి. అన్ని భాషల్లోనూ వస్తున్న ఈ స్పందనే సినిమా రికార్డులకు కారణమైంది.'జైలర్ 2' తన ప్రయాణంలో అనేక రికార్డులను నెలకొల్పింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా రూ. 300 కోట్ల మార్కును (3 రోజుల్లో), రూ. 400 కోట్ల మార్కును (4 రోజుల్లో) దాటిన తమిళ చిత్రంగా ఇది ఇప్పటికే రికార్డు సృష్టించింది. ఈ చారిత్రాత్మక విజయంపై దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "థియేటర్లలో పండగ వాతావరణం నెలకొంది! తలైవా మ్యాజిక్ వేరే లెవెల్. 'జైలర్ 2'కు అద్భుతమైన ప్రేమ, ఆదరణ అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ప్రేక్షకులు ఇలా సంబరాలు చేసుకోవడాన్ని మించిన ఆనందం లేదు" అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంతో తమిళ సినీ పరిశ్రమలో తిరుగులేని బాక్సాఫీస్ కింగ్‌గా రజినీకాంత్ మరోసారి తన స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

## అభిమానులకు సారీ చెప్పిన హీరో విష్వక్ సేన్



యంగ్ హీరో, దర్శకుడు విష్వక్ సేన్ ఏర్పాటు చేసిన ఫ్యాన్ ఫొటో సెషన్‌లో గందరగోళం తలెత్తింది. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోస్‌లో ఆయన దర్శకత్వం వహించి, నటించిన 'కల్ట్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, అంచనాలకు మించి అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పరిస్థితి అదుపుతప్పింది. దీంతో కార్యక్రమాన్ని మధ్యలోనే రద్దు చేయాల్సి రాగా, ఈ ఘటనపై విష్వక్ సేన్ అభిమానులకు హృదయపూర్వకంగా క్షమాపణలు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే, అక్టోబర్ 30న విడుదల కానున్న 'కల్ట్' సినిమా ప్రచారంలో భాగంగా విష్వక్ సేన్ అభిమానులతో ఫొటో సెషన్ ఏర్పాటు చేశారు. అయితే, నిర్వాహకుల అంచనాలు తలకిందులు చేస్తూ వేలాది మంది అభిమానులు రావడంతో భద్రతా ఏర్పాట్లు సరిపోలేదు. దీంతో తోపులాట జరిగి, పరిస్థితి చేయిదాటిపోయింది. భద్రతా కారణాల దృష్ట్యా విష్వక్ సేన్ అక్కడి నుంచి వెళ్ళిపోవడంతో, దూరప్రాంతాల నుంచి వచ్చిన ఎందరో అభిమానులు నిరాశతో వెనుదిరిగారు.ఈ ఘటనపై విష్వక్ సేన్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ భావోద్వేగ ప్రకటన విడుదల చేశారు. "ఫొటో సెషన్ సమయంలో మీకు కలిగిన అసౌకర్యానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. నాతో ఫోటో దిగాలని వచ్చి, అవకాశం దక్కక నిరాశతో వెనుదిరిగిన ప్రతి అభిమానికి సారీ. మీ అందరినీ పలకరించలేకపోయినందుకు ఎంతో బాధగా ఉంది" అని పేర్కొన్నారు. అభిమానుల ప్రేమ ఊహించని స్థాయిలో ఉందని, త్వరలోనే పటిష్ఠమైన భద్రత, మెరుగైన ఏర్పాట్లతో మరోసారి ఫ్యాన్ మీట్ నిర్వహిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## దర్య గురించి చెబుతూ కన్నీటిపర్యంతమైన నటి ఆమని



దివంగత నటి సౌందర్యను తలుచుకుని సీనియర్ నటి ఆమని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో, సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. సౌందర్య అందం, వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ, ఆమె జీవితంలో ఎదుర్కొన్న ఒంటరి పోరాటాన్ని వివరించారు. "చాలామంది ముఖానికి మేకప్ వేస్తేనే తెరపై అందంగా కనిపిస్తారు. కానీ సౌందర్య మాత్రం ఎలాంటి మేకప్ లేకపోయినా అచ్చం దేవతలా ఉండేది. ఆమె నిజంగానే ఓ దేవత. అంత అందంగా ఉండేది కాబట్టేనేమో, ఆ దేవుడు కూడా అంత తొందరగా ఆ దేవతల్లోనే కలిపేసుకున్నాడు" అంటూ ఆమని కన్నీటిపర్యంతమయ్యారు. సినీ రంగంలో ఉన్నప్పటికీ, ''నేను ఇలాగే ఉంటాను.. నాకంటూ ఒక పద్ధతి ఉంది' అని ఒక గిరి గీసుకుని ఉండేది" అని ఆమని తెలిపారు.సౌందర్య ఎంతో అమాయకురాలని, ఆమె వ్యవహారాలన్నీ తొలుత ఆమె తండ్రి, ఆయన మరణం తర్వాత అన్నయ్య చూసుకునేవారని ఆమని గుర్తుచేసుకున్నారు. కష్టపడి కోట్లు సంపాదించినా, భర్త, పిల్లలతో సంతోషంగా జీవించాలనే తన కలలు నెరవేరకుండానే వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బెంగళూరులోని సౌందర్య ఇంటికి వెళ్లానని, ఒకప్పుడు కళకళలాడిన ఆ ఇల్లు పాడుబడినట్టు కనిపించడంతో తన గుండె తరుక్కుపోయిందని ఆమని చెప్పారు. దక్షిణాది ప్రేక్షకులచే మహానటిగా కీర్తించబడిన సౌందర్య, చిన్న వయసులోనే హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే.ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా

## 'ఆదర్శ కుటుంబం' త్రివిక్రమ్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది

హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మీడియాతో మాట్లాడిన శ్రీనిధి, ఈ సినిమా తనకు ప్రత్యేకమని చెప్పారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించాలన్నది తన కోరికని, ఆయన నుంచి అవకాశం రావడం సంతోషంగా అనిపించిందని తెలిపారు. ఈ కథ త్రివిక్రమ్ గత సినిమాల కంటే భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు ఈ సినిమాలో శ్రీనిధి తల్లి పాత్రలో కనిపించనున్నారు. చిట్‌ఫండ్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోయే మహిళగా నటించారు. తొలిసారి పూర్తిస్థాయి కామెడీ పాత్ర చేయడంతో మొదట కొంత సందేహం కలిగినా, సినిమా చూసిన తర్వాత తన నటనపై సంతృప్తి కలిగిందని చెప్పారు. త్రివిక్రమ్ రాసిన సంభాషణల్లో మంచి అర్థం ఉంటుందని, ప్రతి డైలాగ్‌ను అర్థం చేసుకుని చెప్పేందుకు ప్రయత్నించానని శ్రీనిధి తెలిపారు. వెంకటేష్ కామెడీ టైమింగ్ అద్భుతమని, ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవమని అన్నారు. సినిమా విడుదల తేదీని అక్టోబర్ 9 నుంచి 30కి మార్చడంపై స్పందిస్తూ, మంచి అవుట్‌పుట్ కోసం అదనపు సమయం తీసుకోవడం సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. కథ నచ్చితేనే సినిమాలు ఎంచుకుంటానని చెప్పిన శ్రీనిధి, ప్రస్తుతం ఓ కన్నడ చిత్రంలో నటిస్తున్నట్లు వెల్లడించారు. మరికొన్ని తెలుగు సినిమాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.



## పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో సాయి పల్లవి..

ఈ దీపావళికి 'రామాయణ'తో సీతగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు నటి సాయి పల్లవి. ఈ సినిమాతో పాటు ఆమె త్వరలో ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫసర్‌గా యాక్షన్ పంచడానికి సిద్ధమయ్యారు. ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఓం'. 'అమరన్' సినిమాతో ప్రేక్షకులను కట్టిపడేసిన రాజ్‌కుమార్ పెరియసామి ఈ సినిమాకి దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో సాయి పల్లవి నిత్యా రెడ్డి అనే ఐపిఎస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. సోమవారం ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్ర బృందం వీడియోను విడుదల చేసింది. ఎర్ర చందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీస్ నిత్యా రెడ్డి ఏం చేశారు. 'ఆపరేషన్ ఓం' ఏంటి? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.




Editor pastham Saidulu,R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad